క్లుప్తంగా

హరిపురంలో సంకల్ప యాత్ర


హరిపురంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాంబిల్లి : హరిపురం గ్రామంలో శుక్రవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రజా సంక్షేమ పథకాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు అవగాహన కల్పించారు. దిమిలి వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ ఆరోగ్య సేవలను వివరించారు. అనంతరం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీపీ భర్త రమణమూర్తిరాజు(శ్రీనుబాబు), సచివాలయ కన్వీనర్ ధూళి అప్పారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ, ఈవోపీఆర్డీ రాజు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో చేతిబోరు ప్రారంభం


చేతిబోరును ప్రారంభిస్తున్న దృశ్యం

కోటవురట్ల: కె.వెంకటాపురం శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన చేతిబోరును శుక్రవారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల నాని బోరును ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వాలు శ్మశాన వాటికలలో అవసరమైన కనీస సదుపాయాలను కూడా విస్మరించాయన్నారు. చేతిబోరు లేక చాలా ఇబ్బంది పడేవారని, ప్రస్తుతం అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

భక్తి శ్రద్ధలతో మేలు కొలుపు


చూచుకొండలో మేలుకొలుపులు నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక : మండల వ్యాప్తంగా మేలుకొలుపుల కార్యక్రమం ఘనంగా సాగుతుంది. ధనుర్మాసంలో భాగంగా మేలు కొలుపుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన మేలు కొలుపులు పలు గ్రామాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది. వేకువ జామునే పురుషులు, మహిళలు చన్నీటి స్నానమాచరించి పరమేశ్వరుని ఫొటోను చేతబట్టి గ్రామంలో భజనలు చేస్తూ ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి దేవుళ్లను మేలు కొలుపే కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతుంది.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఎస్.రాయవరం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గడిచిన సమావేశంలో తెలిపిన సమస్యలు ఎంతవరకు పరిష్కరించారనే వివరాలతో అధికారులు రావాలన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఎస్.రాయవరం : సంక్షేమంతో పాటు గ్రామాభివృద్ధిపై సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారని జెడ్పీటీసీ కాకర దేవి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు అన్నారు. చిన గుమ్ములూరు గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు దశాబ్దాలు కాలంగా సమస్య ఉండేదని విడతల వారీగా రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు సర్పంచ్ గాడి అప్పల నరసింహం చర్యలు తీసుకున్నారన్నారు. ఈ మేరకు పంచాయితీ నిధులు నుంచి రూ 1.7 లక్షలు కేటాయించి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు.

ఉచిత దంత వైద్య శిబిరం

నక్కపల్లి: మండలంలో డొంకాడలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి దంత వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దంతవైద్య నిపుణులు డాక్టర్ టి నాగిరెడ్డి, డాక్టర్ ప్రియాంకలు దంత వ్యాధుల నివారణ చర్యలు గురించి వివరించారు.

గణితంలో రామానుజన్ కృషి వెలకట్టలేనిది


గణిత ప్రదర్శనలు తిలకిస్తున్న దృశ్యం


రాజుపేట ఎంపీయూపీ స్కూల్ గణిత ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కుమారరాజా


పి.ధర్మవరం పాఠశాల విద్యార్థుల సంఖ్యా విన్యాసం


పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో 1729 సంఖ్య ఆకృతిలో విద్యార్థుల విన్యాసం

నక్కపల్లి : మండలంలో పెద బోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన గణిత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సహాయ ప్రధానోపాధ్యాయురాలు ఎ.వి.ఎస్.ఎస్ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమానికి పెదగుమ్ములూరు హెచ్‌ఎం ఆళ్ల సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. гభారత దేశం ప్రపంచానికి ఫైథాగరస్, ఆర్యభట్ట, భాస్కరాచార్యుడు, వరాహమిరుడు, బ్రహ్మగుప్తుడు వంటి గణిత శాస్త్రవేత్తలను అందించిందన్నారు. సంఖ్యాశాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ చేసిన కృషిని కొనియాడారు. భారత ప్రభుత్వం ఆయన పేరున స్మారక తపాలా బిళ్లను విడుదల చేయడం గొప్ప విషయమన్నారు. గణిత ఉపాధ్యాయుడు చిన్నారావు విద్యార్థులతో చేయించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్. ఆచార్యులు, ఫల్గుణరావు, రమేష్ బాబు శ్రీదేవి పాల్గొన్నారు.

కోటవురట్ల: గణితంలో ఉన్న మతలబు తెలిస్తే ప్రతీ విద్యార్థి మక్కువను పెంచుకుంటారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కుమారరాజా అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పించి విద్యార్థులకు ఆయన జీవిత విశేషాలను వివరించారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు రూపొందించిన గణిత ప్రాజెక్టులను కుమారరాజా పరిశీలించి అభినందనలు తెలిపారు. హెచ్‌ఎం షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో శ్రీనివాసరామానుజన్‌కు ఇష్టమైన 1729 సంఖ్య ఆకృతిలో విద్యార్థులు విన్యాసం చేశారు. హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ అచ్యుతరావు పాల్గొన్నారు.

రాంబిల్లి: దిమిలి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ప్రసాదరావు, గణితశాస్త్ర ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో గణితంపై వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

యలమంచిలి రూరల్ : ప్రపంచ ప్రసిద్ధ గణిత మేధావుల్లో శ్రీనివాస రామానుజన్ ఒకరని యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.వి.హిమబిందు అన్నారు. శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణిత ముగ్గుల పోటీ ఆకట్టుకుంది. గణితంలో ప్రాథమిక పరిక్రియలు, త్రికోణమితి,క్షేత్రగణితం, బీజగణితం నమూనాలు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు.

యలమంచిలి : గణిత దినోత్సవం సందర్భంగా శుక్రవారం పేట బయ్యవరం ,కొక్కిరాపల్లి పాఠశాలల్లో గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, పాపాజీరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగివున్న సామర్థ్యాలు వెలికి తీయవచ్చని చెబుతూ గణిత శాస్త్రం మానవునికి నిత్య జీవితంలో ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించారు. గణిత ప్రదర్శనల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, రవీంద్ర, బి.ధనలక్ష్మి, ఎస్.శ్రీనుబాబు, సూర్యకళ, అనూష, అమ్మాజీ పాల్గొన్నారు.

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి నిర్వహించారు.ఈ సందర్భంగా గణిత శాస్త్రానికి సంబంధించిన పలు సిద్ధాంతాలను చార్టుల్లో రాసి విద్యార్థులు ప్రదర్శించారు.హెచ్‌ఎం రవి,గణిత ఉపాధ్యాయులు హైమవతి,పట్నాయక్,జగదీష్,వెంకటేశ్వర్లు,భాషా సూర్నిషా,పీడీ రాజు,మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : గణిత పితామహుడు డాక్టర్ శ్రీనివాస్ రామానుజన్ జయంతి వేడుకలు పలు పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. పి.ధర్మవరం గ్రామంలో విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ నెంబర్ 1729 ఆకారంలో విన్యాసం చేసి అలరించారు. అంతకు ముందు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు ప్రసంగించారు. విద్యార్థులు మేధాశక్తి ఎలా పెంచుకోవాలి.. అనే అంశంపై మెలకువలు తెలిపారు. పెదగుమ్ములూరు పాఠశాలలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. రేవు పోలవరం పాఠశాలలోనూ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు.


యలమంచిలి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గణిత ముగ్గు


హరిపాలెం ఉన్నత పాఠశాలలో గణిత సిద్ధాంతాల చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


పేటబయ్యవరం పాఠశాలలో గణితశాస్త్రంపై నమూనా ప్రదర్శన చూపుతున్న విద్యార్థులు


దిమిలి హైస్కూల్లో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం ప్రసాదరావు

ప్రలోభాలకు లొంగవద్దు

నక్కపల్లి : ప్రతిపక్షాలు చేసే ప్రలోభాలకు తలొగ్గకుండా వచ్చే సాధారణ ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి కోరారు. శుక్రవారం చినతీనార్లలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేసిన ఆర్థిక సాయం మొత్తం వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలపై జగనన్న ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితి రూ.25 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. అవ్వాతాతలకు ఇస్తున్న పింఛన్లు వచ్చే నెల నుంచి మూడు వేల రూపాయల చొప్పున చెల్లించేందుకు వీలుగా జగనన్న జీవో జారీ చేశారన్నారు. అధికారంలోకి రావడం కోసం ప్రతిపక్ష టీడీపీ ఎన్నో ఉచిత పథకాలను ప్రకటిస్తోందన్నారు. జగనన్న ఇస్తే సోమరిపోతులను తయారు చేస్తున్నారని విమర్శించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఇప్పుడు అవే పథకాలను ప్రకటించడం సిగ్గుచేటన్నారు. గ్రామంలో పార్టీ జెండాను శీరం నర్సింహమూర్తి ఆవిష్కరించారు. సర్పంచ్ ముసలయ్య, ఎంపిటీసీ కో ఆప్షన్ సభ్యుడు చంద్రరావు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ గోవిందు, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న నేతలు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కోటవురట్ల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థను పటిష్టపరుస్తూ విద్యార్థుల బంగారు భవితకు ఎంతగానో కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు మండల స్థాయిలో ఉచిత ట్యాబ్‌ల పంపిణీ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీతారామరాజు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి చేతుల మీదుగా విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఎంఈవో-1 రామారావు, ఎంఈవో-2 శ్రీజోష్, పేరెంట్ కమిటీ చైర్మన్ శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, కృష్ణారావు, హెచ్‌ఎం యేసుదాసు పాల్గొన్నారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్, సర్పంచ్ శివరామ్, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, పేరెంట్ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


జెడ్పీబాలికోన్నత పాఠశాలలో ట్యాబ్‌లతో విద్యార్థులు

రామన్నపాలెంలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ

కోటవురట్ల: రాజన్నా ధవళ వస్త్రాల్లో నీ దరహాసం , నీ ఆత్మీయతను ఎన్నటికీ మరువలేం..మా గుండెల్లో నీమీదున్న ప్రేమ అనంతమైనది..నువ్వు ఎప్పటికీ మాతోనే ఉంటావు...అంటూ రాజుపేట శివారు రామన్నపాలెం గ్రామానికి చెందిన యువకులు మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డిపై తమ అచంచలమైన ప్రేమను వ్యక్తపరిచారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని రామన్నపాలెంలో మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గురువారం రాత్రి ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన పి.వెంకినాయుడు, కె.గోపాలకృష్ణ, వై.శ్రీను, వి.కృష్ణ, బి.శ్రీను మహానేత విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయగా గ్రామస్తులు, గ్రామ పెద్దలు సహకారం అందించారు. ఫలితంగా రాజన్నపై ఉన్న ప్రేమ విగ్రహావిష్కరణతో ఆవిష్కృతమైంది.


రామన్నపాలెంలో మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణలో యువకులు

అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి పాలన

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని, బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీటీసీ లంక సూరిబాబు అన్నారు. పట్టణంలో గల 5 వ సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే...కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సచివాలయ పరిధిలో సంక్షేమం, అభివృద్ధి నిధుల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పార్వతీ తాతారావు, ఉప సర్పంచ్ భవానీ శ్రీనివాస్, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ బోడిపల్లి శ్రీను, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొద్దా శ్రీదేవి, మహిళా అధ్యక్షురాలు సీతారత్నం పాల్గొన్నారు.


సంక్షేమ డిస్‌ప్లే బోర్డును ప్రారంభించిన జెడ్పీటీసీ సూరిబాబు, సాయిబాబా

డిజిటల్ విద్యకు ప్రాధాన్యం


పి.ధర్మవరం పాఠశాలలో ట్యాబుల పంపిణీ

ఎస్.రాయవరం : ప్రభుత్వ పాఠశాలలో విద్యా విధానం మెరుగుపడేలా డిజిటల్ విద్యకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం వేల రూపాయలు విలువ చేసే ట్యాబులు విద్యార్థులకు అందిస్తోందని పి.ధర్మవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వి. రమణరావు అన్నారు. ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు సమకూర్చిన ట్యాబులను శనివారం విద్యార్థులకు అందజేశారు. ఈ ట్యాబులు ద్వారా విద్యార్థులు సబ్జెక్టుల్లో సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. దార్లపూడి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ట్యాబులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు


రామగిరిలోని కోదండ సీతారామచంద్రమూర్తి

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. రామగిరి కొండపై వెలసిన శ్రీ కోదండ సీతారామ చంద్రమూర్తి ఆలయ ప్రాంగణంలో ముక్కోటి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. సాయంత్రం 6 గంటల నుంచి గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరగనుంది. పాటిపల్లి లక్ష్మీ వరహా నరసింహస్వామి ఆలయం వద్ద వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ కూడా గిరి ప్రదక్షిణకు అవసరమయ్యే సన్నాహాలు చేస్తున్నారు.

ఉమ్మలాడలో పారిశుధ్య పనులు


ఉమ్మలాడలో పారిశుధ్యం పనులు పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఉమ్మలాడ సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ (ఎస్ఆర్) కోరారు.గ్రామంలో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులను ఆమె శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో ఎటువంటి వ్యాధులు సంభవించకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు.పంచాయతీ కార్యదర్శి కార్యక్రమంలో పాల్గొన్నారు.

గణిత పోటీల విజేతలకు అభినందన

మునగపాక: పలు పాఠశాలల్లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం ఘనంగా పోటీలు నిర్వహించారు. తిమ్మరాజుపేట హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో ఏపీ మేథమేటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. వారికి బహుమతులు అందజేశారు. విజేతలు శరణ్య,సూరిశెట్టి కుసుమ ప్రసాద్, ఆదిత్య మరిన్ని బహుమతులు అందుకునేలా చదువుకోవాలని హెచ్‌ఎం గాలి అప్పారావు కోరారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు లక్ష్మునాయుడు, మరియమ్మ పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

కోటవురట్ల: మన అద్భుతమైన సనాతన ధర్మాన్ని కాపాడుకునేందుకు ప్రతి హిందువు ముందుకు రావాలని హిందూ జనశక్తి అధ్యక్షుడు లలిత్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ మహా సమ్మేళనాన్ని శుక్రవారం నిర్వహించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల నుంచి భక్తులు కాషాయ వస్త్రాలు ధరించి ర్యాలీ చేశారు. స్థానిక శివాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట వున్న గ్రౌండ్ వరకు కాషాయ వస్త్రధారులతో జై శ్రీరామ్ నినాదం మిన్నంటింది. సమ్మేళనంలో పాల్గొన్న లలిత్‌కుమార్ హిందూ ధర్మం, మత మార్పిడి గురించి ఉత్తేజ పూరితంగా మాట్లాడారు. సనాతన హిందూ ధర్మంలో రుషులు, మునులు మన ఆచార వ్యవహారాలను ఎంతో చక్కగా గ్రంథాల్లో పొందుపరిచారన్నారు. ఎవరైనా మతమార్పిడికి ప్రలోభపెడితే ప్రతి హిందువు అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచారక్‌లు మాలకొండారెడ్డి, ముత్యాల నాయుడు, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ నక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.


కోటవురట్లలో హిందూ మహా సమ్మేళనంలో మాట్లాడుతున్న లలిత్‌కుమార్

'ఆడుదాం..ఆంధ్రా' స్ఫూర్తితో ఆటల పోటీలు

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను

పాయకరావుపేట : గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఆడుదాం ఆంధ్ర...స్ఫూర్తితో జగనన్న జన్మదినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించినట్టు పాయకరావుపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు తెలిపారు. పాయకరావుపేట ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ఆటల పోటీలు గురువారం రాత్రితో ముగిసాయన్నారు. వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించగా, నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల నుంచి సుమారు 20 జట్లు దాదాపు 400 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు తెలిపారు. విజేతలకు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేలు, మూడో బహుమతి కింద రూ.10 వేలు చొప్పున అందజేయడం జరిగిందన్నారు. ఇవి కాకుండా ప్రోత్సాహక బహుమతులు ఇచ్చామన్నారు. పోటీలు నిర్వహించిన గూటూరు శ్రీనును కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు, పాయకరావుపేట మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బాబూరావు అభినందించారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవవరపు సూర్యచక్రం, మైలపల్లి అశోక్, అనిశెట్టి వెంకటసూరి, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ సుందరరావు, సత్తిబాబు, అర్జున్ పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులతో పాటు, మెమెంటో అందజేస్తున్న నాయకులు

పంట కోల్పోయిన ప్రతి రైతుకు సాయం

మునగపాక: తుపానుకు దెబ్బతిన్న పంటకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టిందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. ఇటీవల సంభవించిన తుపానుకు దెబ్బతిన్న వరి పంటకు సంబందించిన బాధిత రైతుల జాబితాను మునగపాక సచివాలయ ప్రాంగణంలో శుక్రవారం రైతులకు అందుబాటులో ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పైరు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. వరికి సంబంధించి ఎకరాకు రూ.6800 వంతున పరిహారం అందుతుందన్నారు. బాధిత రైతుల వివరాలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడైనా సమస్య ఉంటే అధికారులను సంప్రదించాలన్నారు. జేఏసీ మండల కన్వీనర్ పొలిమేర గణేష్, పంచాయతీ కార్యదర్శి శివ, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద పాల్గొన్నారు.


పంట నష్టపరిహారానికి సంబంధించి బాధిత రైతుల జాబితా ప్రదర్శిస్తున్న దృశ్యం

పారదర్శకంగా సంక్షేమ పాలన

కోటవురట్ల: రాష్ట్రంలో ఉన్న ప్రతి గడపకు పారదర్శకంగా సంక్షేమం అందుతున్నందుకే మళ్లీ జగనే సీఎం కావాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. రాజుపేటలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యల్లపు కుమారరాజా ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంక్షేమ ఫ్లెక్సీ, మా నమ్మకం నువ్వే జగన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశమయ్యారు. గతంలోని టీడీపీ రాక్షస పాలనను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. పింఛను కావాలంటే జన్మభూమి కమిటీ చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సివచ్చేదన్నారు. కార్పొరేషన్ రుణం కావాలంటే టీడీపీ కార్యకర్తగా ఉండి జన్మభూమి కమిటీ వాళ్లకు ముడుపులు చెల్లించాల్సి వచ్చేదన్నారు. ఇపుడు సీఎం జగన్ ఏవిధమైన ప్రచార ఆర్భాటం లేకుండా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో నగదు జమ చేస్తున్నారన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమం పారదర్శకంగా అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు పైల రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ఉమాదేవి, సిద్ధాబత్తుల సత్యనారాయణ, ప్రసాద్, సర్పంచులు పైల శివరాం, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


రాజుపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు